فَيُعَذِّبُهُ اللّٰهُ الْعَذَابَ الْاَكْبَرَ ﴿٢٤﴾

**24**. అప్పుడు అతనికి అల్లాహ్ ఘోరశిక్ష విధిస్తాడు.

اِنَّ اِلَيْنَآ اِيَابَهُمْ ﴿٢٥﴾

**25**. నిశ్చయంగా, మా వైపునకే వారి మరలింపు ఉంది,

ثُمَّ اِنَّ عَلَيْنَا حِسَابَهُمْ ﴿٢٦﴾

**26**. ఆ తర్వాత నిశ్చయంగా, వారి లెక్కతీసుకునేదీ మేమే!

## 89. సూరహ్ అల్-ఫజ్ర్

سُوْرَةُ الْفَجْرِ

అల్-ఫజ్ర్: The Dawn, The Day Break, ప్రాతఃకాలం, వేకువజాము. అవతరణా క్రమంలో ఇది 10వది. మక్కాలో అవతరింపజేయబడిన ఈ సూరహ్‌లో **30** ఆయతులు ఉన్నాయి.

بِسْمِ اللّٰهِ الرَّحْمٰنِ الرَّحِيْمِ

అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

وَالْفَجْرِ ﴿١﴾

**1**. ప్రాతఃకాలం సాక్షిగా![1]

وَلَيَالٍ عَشْرٍ ﴿٢﴾

**2**. పది రాత్రుల సాక్షిగా![2]

وَّالشَّفْعِ وَالْوَتْرِ ﴿٣﴾

**3**. సరి బేసీల సాక్షిగా!

وَالَّيْلِ اِذَا يَسْرِ ﴿٤﴾

**4**. గడచిపోయే రాత్రి సాక్షిగా!

هَلْ فِيْ ذٰلِكَ قَسَمٌ لِّذِيْ حِجْرٍ ﴿٥﴾

**5**. వీటిలో బుద్ధిగల వాని కొరకు ఏ ప్రమాణమూ లేదా ఏమిటి?[3]

اَلَمْ تَرَ كَيْفَ فَعَلَ رَبُّكَ بِعَادٍ ﴿٦﴾

**6**. నీ ప్రభువు 'ఆద్ (జాతి) వారిపట్ల ఎలా వ్యవహరించాడో నీకు తెలియదా?[4]

---

**1**. అంటే ప్రతి ఉదయం. ఒక ప్రత్యేక ఉదయం కాదు.

**2**. అంటే జు'ల్-'హజ్జ్ యొక్క మొదటి పదిరాత్రులని చాలా మంది వ్యాఖ్యాతల అభిప్రాయం. వీటి ఘనత 'హదీసు'లలో ఉంది. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: ''జు'ల్-'హజ్జ్ మొదటి పది రోజులలో చేసే సత్కార్యాలు అల్లాహ్(సు.తా.)కు ఎంతో ఇష్టమైనవి - జిహాద్ కంటే కూడా - మానవుడు అమరగతి నొందిన జిహాద్ తప్ప! ('స'హీ'హ్ బు'ఖారీ).

**3**. అంటే వీటన్నిటి ప్రమాణం చేయటం, అల్లాహ్ (సు.తా.)ను విశ్వసించటానికి చాలదా! 'హిజ్‌రున్: ఆపటం, కాదనటం, బుద్ధికూడా మానవుడిని చెడు కర్మలనుండి ఆపుతుంది.

**4**. వారి ప్రవక్త హూద్ ('అ.స.). చూడండి, 69:7-10 మరియు 7:65-72.

إِرَمَ ذَاتِ الْعِمَادِ ۝٧

**7**. ఎత్తైన స్తంభాల (భవనాలు గల) ఇరమ ప్రజల పట్ల?[1]

الَّتِي لَمْ يُخْلَقْ مِثْلُهَا فِي الْبِلَادِ ۝٨

**8**. వారిలాంటి జాతి భూమిలో ఎన్నడూ సృష్టించబడలేదు.[2]

وَثَمُودَ الَّذِينَ جَابُوا الصَّخْرَ بِالْوَادِ ۝٩

**9**. మరియు లోయలలోని కొండ రాళ్ళలో (భవనాలను) తొలిచిన సమూద్ జాతి పట్ల?[3]

وَفِرْعَوْنَ ذِي الْأَوْتَادِ ۝١٠

**10**. మరియు మేకులవాడైన ఫిర్'ఔన్ పట్ల?[4]

الَّذِينَ طَغَوْا فِي الْبِلَادِ ۝١١

**11**. వారంతా ఆయా దేశాలలో తలబిరుసు తనంతో ప్రవర్తించారు;

فَأَكْثَرُوا فِيهَا الْفَسَادَ ۝١٢

**12**. మరియు వాటిలో దౌర్జన్యాన్ని రేకెత్తించారు.

فَصَبَّ عَلَيْهِمْ رَبُّكَ سَوْطَ عَذَابٍ ۝١٣

**13**. కాబట్టి నీ ప్రభువు వారిపైకి అనేక రకాల బాధాకరమైన శిక్షలను పంపాడు.

إِنَّ رَبَّكَ لَبِالْمِرْصَادِ ۝١٤

**14**. వాస్తవానికి, నీ ప్రభువు మాటువేసి ఉన్నాడు (అంతా కనిపెడ్తూ ఉంటాడు)!

فَأَمَّا الْإِنْسَانُ إِذَا مَا ابْتَلَاهُ رَبُّهُ فَأَكْرَمَهُ وَنَعَّمَهُ فَيَقُولُ رَبِّي أَكْرَمَنِ ۝١٥

**15**. అయితే మానవుడు ఎలాంటి వాడంటే: అతని ప్రభువు అతన్ని పరీక్షించటానికి, అతనికి గౌరవప్రతిష్ఠలనిచ్చి అనుగ్రహించినప్పుడు: "నా ప్రభువు నన్ను గౌరవించాడు." అని అంటాడు;[5]

وَأَمَّا إِذَا مَا ابْتَلَاهُ فَقَدَرَ عَلَيْهِ رِزْقَهُ فَيَقُولُ رَبِّي أَهَانَنِ ۝١٦

**16**. కాని, అతన్ని పరీక్షించటానికి, అతని ఉపాధిని తగ్గించినప్పుడు: "నా ప్రభువు నన్ను అవమానించాడు." అని అంటాడు.[6]

---

**1**. ఇరమ: ఒక తెగ పేరు. దాని పూర్వోత్తరాలు ఇలా ఉన్నాయి: 'ఆద్ బిన్-'ఔస్ బిన్-ఇరమ బిన్ -సామ్ బిన్-నూ'హ్. (ఫ'త్హ్ అల్-ఖదీర్) వీరిని 'ఆద్ ఊలా, అని కూడా అంటారు. వీరిని ఎత్తైన స్తంభాల (భవనాల) వారని కూడా అంటారు.

**2**. 'ఆద్ జాతివారికి తమ బలసామర్థ్యాల మీద ఎంతో గర్వం ఉండేది. చూడండి, 41:15.

**3**. వీరి ప్రవక్త 'సాలి'హ్ ('అ.స.). చూడండి, 26:149.

**4**. అంటే పెద్దసైన్యం గలవాడు, లేక ప్రజలను మేకులతో నాటి శిక్షించేవాడు. (ఫ'త్హ్ అల్-ఖదీర్).

**5**. అల్లాహ్ (సు.తా.) ధనధాన్యాలు, సౌభాగ్యాలు ఇచ్చినా, పరీక్షించటానికే! మరియు పేదరికానికి గురిచేసినా, అదీ పరీక్షించటానికే!

**6**. అల్లాహ్ (సు.తా.) తన సద్వర్తనులైన దాసులకు భోగభాగ్యాలు, ధనధాన్యాలు ప్రసాదించవచ్చు!

كَلَّا بَل لَّا تُكْرِمُونَ الْيَتِيمَ ﴿١٧﴾

**17**. అలా కాదు, వాస్తవానికి మీరు అనాథులను ఆదరించరు;[1]

وَلَا تَحَاضُّونَ عَلَىٰ طَعَامِ الْمِسْكِينِ ﴿١٨﴾

**18**. మరియు మీరు పేదలకు అన్నం పెట్టే విషయంలో ఒకరినొకరు ప్రోత్సహించుకోరు;[2]

وَتَأْكُلُونَ التُّرَاثَ أَكْلًا لَّمًّا ﴿١٩﴾

**19**. మరియు వారసత్వపు ఆస్తిని పేరాశతో అంతా మీరే తినేస్తారు.

وَتُحِبُّونَ الْمَالَ حُبًّا جَمًّا ﴿٢٠﴾

**20**. మరియు మీరు ధన వ్యామోహంలో దారుణంగా చిక్కుకు పోయారు![3]

كَلَّا إِذَا دُكَّتِ الْأَرْضُ دَكًّا دَكًّا ﴿٢١﴾

**21**. అలా కాదు, భూమి, దంచి పిండి పిండిగా చేయబడినపుడు;

وَجَاءَ رَبُّكَ وَالْمَلَكُ صَفًّا صَفًّا ﴿٢٢﴾

**22**. మరియు నీ ప్రభువు (స్వయంగా) వస్తాడు మరియు దేవదూతలు వరుసలలో వస్తారు.[4]

وَجِيءَ يَوْمَئِذٍ بِجَهَنَّمَ ۚ يَوْمَئِذٍ يَتَذَكَّرُ الْإِنسَانُ وَأَنَّىٰ لَهُ الذِّكْرَىٰ ﴿٢٣﴾

**23**. ఆ రోజు నరకం (ముందుకు) తీసుకు రాబడుతుంది. ఆ రోజు మానవుడు (తన కర్మలన్నీ) జ్ఞప్తికి తెచ్చుకుంటాడు; కాని ఆ రోజు జ్ఞప్తికి తెచ్చుకోవడం వల్ల అతనికి కలిగే ప్రయోజనమేమిటీ?

يَقُولُ يَا لَيْتَنِي قَدَّمْتُ لِحَيَاتِي ﴿٢٤﴾

**24**. అతడు: "అయ్యో! నా పాడుగాను! నా ఈ జీవితం కొరకు నేను (సత్కార్యాలు) చేసి పంపుకొని ఉంటే ఎంతబాగుండేది!" అని వాపోతాడు.

---

లేక పేదరికానికీ గురిచేసి పరీక్షించవచ్చు. అదే విధంగా సత్యతిరస్కారులకు కూడా ఐశ్వర్యా లివ్వవచ్చు లేక పేదరికంతో పరీక్షించవచ్చు! సద్వర్తనులైన విశ్వాసులు ఐశ్వర్యవంతులుగా ఉంటే అల్లాహ్ (సు.తా.)కు కృతజ్ఞులుగా ఉంటారు. పేదరికానికి గురిఅయితే సహనం వహిస్తారు.

**1**. దైవప్రవక్త ('స'అస) ప్రవచనం: 'అనాథులతో మంచిగా వ్యవహరించేవారు స్వర్గంలో నాతోపాటు - రెండు వ్రేళ్ళు తోడుగా ఉన్నట్లు - ఉంటారు.' (అబూ-దావూద్) కావున అనాథులను పోషించడం, వారితో మంచిగా వ్యవహరించడం ఎంతో పుణ్యకార్యం.

**2**. చూడండి, 107:3.

**3**. జమ్మన్: కసీ'రన్, చాలా.

**4**. ఏడు ఆకాశాల దైవదూతలు ఏడు వరుసలలో నిలబడతారు.

**25.** అయితే ఆ రోజు, ఆయన (అల్లాహ్) శిక్షించినట్లు, మరెవ్వడూ శిక్షించలేడు!

فَيَوْمَئِذٍ لَّا يُعَذِّبُ عَذَابَهُۥٓ أَحَدٌ ﴿٢٥﴾

**26.** మరియు ఆయన (అల్లాహ్) బంధించినట్లు, మరెవ్వడూ బంధించలేడు.[1]

وَلَا يُوثِقُ وَثَاقَهُۥٓ أَحَدٌ ﴿٢٦﴾

**27.** (సన్మార్గునితో ఇలా అనబడుతుంది): "ఓ తృప్తిపొందిన ఆత్మా!

يَٰٓأَيَّتُهَا ٱلنَّفْسُ ٱلْمُطْمَئِنَّةُ ﴿٢٧﴾

**28.** "నీ ప్రభువు సన్నిధికి మరలి రా! (నీకు లభించే సత్ఫలితానికి) ఆనందిస్తూ మరియు (నీ ప్రభువునకు) ప్రియమైన దానివై!

ٱرْجِعِىٓ إِلَىٰ رَبِّكِ رَاضِيَةً مَّرْضِيَّةً ﴿٢٨﴾

**29.** "నీవు (పుణ్యాత్ములైన) నా దాసులలో చేరిపో!

فَٱدْخُلِى فِى عِبَٰدِى ﴿٢٩﴾

**30.** "మరియు నీవు నా స్వర్గంలో ప్రవేశించు!" (5/8)

وَٱدْخُلِى جَنَّتِى ﴿٣٠﴾

## 90. సూరహ్ అల్-బలద్

سُورَةُ الْبَلَدِ

అల్-బలద్: నగరం, పురం, పట్నం, The City, The Land. ఈ సూరహ్ పేరు మొదటి ఆయత్ నుండి తీసుకోబడింది. ఇది మొదటి మక్కా కాలపు సూరహ్. ఇందులో **20** ఆయతులు ఉన్నాయి.

అనంత కరుణామయుడు అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

بِسْمِ ٱللَّهِ ٱلرَّحْمَٰنِ ٱلرَّحِيمِ

**1.** * కాదు, నేను ఈ నగరం (మక్కా) సాక్షిగా (అంటున్నాను)!

لَآ أُقْسِمُ بِهَٰذَا ٱلْبَلَدِ ﴿١﴾

**2.** మరియు నీకు ఈ నగరం (మక్కా)లో స్వేచ్ఛ ఉంది.

وَأَنتَ حِلٌّۢ بِهَٰذَا ٱلْبَلَدِ ﴿٢﴾

**3.** మరియు తండ్రి (మూల పురుషుడు) మరియు అతని సంతానం సాక్షిగా![2]

وَوَالِدٍ وَمَا وَلَدَ ﴿٣﴾

---

1. చూడండి, 73:12-13.
2. కొందరు: 'తండ్రి (మూల పురుషుడు) అంటే ఆదమ్ ('అ.స.) మరియు అతని సంతానం అంటే మానవజాతి.' అన్నారు.